క్లుప్తంగా

ఘనంగా వేపారమ్మ పండగ



పూజారి కాళ్లు కడిగి నమస్కరిస్తున్న మహిళలు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో వింత ఆచారం ఉంది. కొందరు రైతులు వేపారమ్మ తల్లిని కొలిచి మొక్కులు చెల్లించుకుంటారు. గ్రామ ఆచారం ప్రకారం పూజారి అమ్మవారికి పసుపు, కుంకుమలతో గ్రామంలోని అన్ని వీధుల్లో తిరుగుతూ జీడి తోటల్లో వెలసిన అమ్మవారి ఆలయానికి తీసుకెళతారు. ఈ క్రమంలో దారి పొడవునా మహిళలు పూజారి కాళ్లను పసుపు నీళ్లతో కడిగి నమస్కరిస్తారు. ఇలా చేయడం వల్ల పాడి పంటలతో సుభిక్షంగా ఉంటామని రైతుల నమ్మకం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



కె.వెంకటాపురంలో పోషకాహారంతో లబ్ధిదారులు

కోటవురట్ల: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని అంగన్‌వాడీ కార్యకర్త సత్యవతి అన్నారు. కె.వెంకటాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ఆవశ్యతను వివవరించి ఇంట్లో లభించే పప్పు దినుసులు, కూరగాయలతో పోషకాహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చో వివరించారు. అనంతరం పాలు, గుడ్లు, చిక్కీలు అందజేశారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి



కోటవురట్లలో అభివృద్ధిని వివరిస్తున్న ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం

కోటవురట్ల: పంచాయతీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు అన్నారు. మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. కోటవురట్ల గ్రామసభలో ఎంపీడీవో మాట్లాడుతూ పాలక వర్గ సభ్యులు, అధికారులు సమన్వయంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం వివిధ శాఖల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. సర్పంచ్ బొడ్డపాటి అనిల్‌కుమార్, ఎంపీటీసీ పుట్రేవు వెంకట సూర్యారావు పాల్గొన్నారు.

5న లక్ష్మణగీత నాటక ప్రదర్శన

మునగపాక : మునగపాకలో ఈ నెల 5న మరిడి మహలక్ష్మి అమ్మవారి పండగ సందర్భంగా 'లక్ష్మణ గీత' సాంఘిక నాటకం ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మునగపాక రామాలయం వద్ద శ్రీ లక్ష్మీ కళా యూనియన్ (పాటి దిబ్బ) ఆధ్వర్యంలో రాత్రి 9 గంటలకు ఈ నాటక ప్రదర్శన జరుగుతుందన్నారు. దాడి జగన్నాథరావు రచన, దర్శకత్వం వహిస్తుండగా, దాడి ముసిలినాయుడు పర్యవేక్షణ, ఆర్గనైజర్లుగా దాడి నూక కొండలరావు, దాడి వీర వెంకట అప్పారావు వ్యవహరిస్తారు. కళాభిమానులు నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

చినపూడి గ్రామాన్ని తరలించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చినపూడి గ్రామాన్ని తరలించాలని మంగళవారం స్థానికులు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గ్రామానికి సమీపంలో ఉన్న ఏసియన్ పెయింట్స్, రోడ్డుకి అవతల ఉన్న ఈటీపీ ప్లాంట్ వల్ల తీవ్ర వాయు కాలుష్యం, నీటి కాలుష్యం ఏర్పడిందని సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామాన్ని తరలించి, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూండ్రపు సోమునాయుడు, జయమ్మ, నూకరత్నం, అప్పలనర్స పాల్గొన్నారు.

వైద్యరంగంలో నూతన సంస్కరణలకు నాంది

- ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే సర్కారు వైద్యం
- ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్య రంగంలో నూతన సంస్కరణలకు నాంది పలికిందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం ఆయన డీఎల్‌పురంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. రోగులతో మాట్లాడి వారికి సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. పేదలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యాన్ని వారి చెంతనే అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ సుకన్యలతో పాటు విశాఖ నుంచి వచ్చిన మరో ఇద్దరు వైద్య నిపుణులు రోగులకు ఏడు రకాల పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, యూరిన్, మలేరియా, టీబీ, హెమోగ్లోబిన్, డెంగ్యూ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఈ శిబిరంలో 424 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడుగురిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు, శస్త్ర చికిత్సల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, ఎంపీటీసీ సభ్యుడు లొడగల చంద్రరావు, కనకారావు, సర్పంచ్ కిల్లాడ కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పార్టీ నాయకులు బొల్లం బాబ్జి, సూరాకాసుల గోవిందు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీను పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : వమ్మవరంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే బాబూరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ రోగులకు పంపిణీ చేశారు. పేదవాడి ఆరోగ్యం



శిబిరంలో వైద్య సేవలపై రోగులను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోసం నిత్యం ఆలోచించే ముఖ్యమంత్రి దొరకడం మన అదృష్టమన్నారు. పెనుగొల్లు, సర్వసిద్ధి వైద్యాధికారులు రాజేశ్వరి, వాసంతి 360 మంది రోగులకు వైద్య పరీక్షలు అందించగా, 8 మందిని ఉన్నత వైద్యం కోసం పట్టణ ఆసుపత్రులకు తరలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఎంపీపీ లోవ లక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్ పాపారావు, ఎంపీటీసీ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన సత్యనారాయణ, శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు రక్ష : ఎమ్మెల్యే రణమూర్తిరాజు

యలమంచిలి : రాష్ట్రంలో పేద ప్రజల కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. మంగళవారం యలమంచిలి మండలం లైనుకొత్తూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలసి సందర్శించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అందుతున్న సేవలను వైద్యబృందంతో అడిగి తెలుసుకుని ప్రజలకు వాటి ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని రకాల వ్యాధులకు 7 రకాల పరీక్షలతో కూడిన ఆరోగ్య సేవలు పొందేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని తెలిపారు. రాష్ట్రంలో మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108, 104 వంటి సేవలు



శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

తీసుకువచ్చి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సొంతం చేసుకున్నారని తెలిపారు. జగనన్న ప్రభుత్వం మరిన్ని సంస్కరణలతో విలేజ్ క్లినిక్‌లు, అర్బన్ క్లినిక్‌లు ద్వారా వైద్యులను ఏర్పాటు చేసి పేదల చెంతకే వైద్యసేవలు తీసుకొచ్చారని తెలిపారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది, మందులు కొరత లేకుండా ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ రాజాన శేషు, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, మండల ప్రత్యేకాధికారి, లక్ష్మణరావు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు, వెలుగు ఏపీఎం రాణి, యలమంచిలి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రూరల్ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మునగపాక: గణపర్తి హైస్కూల్లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మంగళవారం ప్రారంభించారు. గణపర్తి సచివాలయ పరిధిలో ఎంతమందికి జనరేట్ చేశారని వైద్యాధికారి ఎస్తేర్‌రాణిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ చదరం నాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్య నాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనకలక్ష్మి



వైద్యసేవలపై సిబ్బందిని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అప్పారావు, మునగపాక, చూచుకొండ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు రామ్మోహనరావు, పెంటకోట హరేరామ, సచివాలయ కన్వీనర్‌లు అప్పలనాయుడు, గుంట్ల అప్పారావు, చూచుకొండ, మెలిపాక సర్పంచ్‌లు దొడ్డి సూరప్పారావు, విజయ భాస్కర్, ఎంపీటీసీ కిరణ్ పాల్గొన్నారు.

రాంబిల్లి : గోవిందపాలెంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సందర్శించారు. ఈ శిబిరంలో ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చంద్రబాబు పాలనలో కుక్క, పాము కాట్లకూ పీహెచ్‌సీల్లో మందులు వుండేవి కావన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ శిరీష భర్త రమణమూర్తిరాజు(శ్రీనుబాబు), వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ భాగ్యవతి పాల్గొన్నారు.

రాజవరంలో ఆరోగ్య సురక్ష శిబిరం

పాయకరావుపేట : మండలంలో రాజవరం గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని అధికారులు నిర్వహించారు. రోగులకు షుగర్, బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధిత వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ హనుతేజ్, డాక్టర్



తంతడిలో జరిగిన ఆరోగ్య సురక్షలో వైద్యులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



రాజవరం గ్రామ సచివాలయం వద్ద వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం

మాధురి, డాక్టర్ కె.నరసింహామూర్తి, పాయకరావుపేట, శ్రీరాంపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ పి.కావ్య రోగులను తనిఖీ చేశారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు, రాజవరం, కేశవరం గ్రామాల సర్పంచ్‌లు అమ్మాజీ, రామగోవిందు, ఎంపీటీసీ మరిణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణ, పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, ఈవోఆర్డీ సత్యనారాయణ, సోషల్ మీడియా ప్రతినిధి కాకాడ కృష్ణ, గ్రామ సచివాలయ, అంగన్‌వాడీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తంతడిలో జగనన్న ఆరోగ్య సురక్ష

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తంతడి గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని పరిశీలించారు. సర్పంచ్ మురళి, ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, నర్మాల కుమార్, దేశంశెట్టి శంకర్‌రావు, పిన్నంరాజు వాసు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

యలమంచిలి : రాష్ట్ర స్థాయి బాలికల త్రోబాల్ పోటీలకు మండలంలో కె.పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని యాంద్ర బేబి ఎంపికైందని హెచ్ఎం శ్రీమతి శోభారాణి మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యాంద్ర బేబి ప్రతిభ కనబరిచింది. ఆమె రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జె.ప్రకాశరావు, మండల వైస్ ఎంపీపీ రాజాన శేషు, ఉపాధ్యాయులు మల్లిపాటి సత్యనారాయణ, ఎస్.నానిబాబు పాఠశాల సిబ్బంది అభినందించారు.



రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి యాంద్ర బేబితో ఉపాధ్యాయులు

10లోగా ఈకేవైసీ చేయించాలి

మునగపాక : రైతులు ఈనెల10లోగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ సహాయకుడు డాక్టర్ రామారావు కోరారు. మునగపాక నందీశ్వర తులసీ కళావేదిక ప్రాంగణంలో జరుగుతున్న ఈకేవైసీ నమోదు పనులను ఆయన మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేయించుకుని తద్వారా ప్రభుత్వం అందించే సేవలను వినియోగించుకోవాలన్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. వీఏఏ సింధూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువతో ఆర్థిక పరిపుష్టి

కోటవురట్ల: జగనన్న పాలవెల్లువతో ఆర్థిక పురోభివృద్ధి కలుగుతుందని ఉప సర్పంచ్ గొల్లు శ్రీనివాసరావు అన్నారు. కె.వెంకటాపురంలో జగనన్న పాల వెల్లువ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలని ఆలోచనతో అమూల్ డెయిరీతో ఒప్పందం చేసిందన్నారు. మిగతా డెయిరీల కంటే అధిక ధరను అమూల్ చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అమూల్ సిబ్బందితో పాటు మహిళా రైతులు పాల్గొన్నారు.



జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పిస్తున్న అమూల్ సిబ్బంది

మునగపాకలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

మునగపాక : క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యం పెరుగుతుందని మునగపాక ఉత్సవకమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు అన్నారు. మరిడిమహాలక్ష్మి అమ్మవారి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను అప్పలనాయుడు మంగళవారం రాత్రి నందీశ్వరా ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో కబడ్డీకి ఎంతో ఆదరణ ఉందన్నారు. క్రీడల ద్వారా రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఇటువంటి పోటీలు నిర్వహించడం కత్తిమీద సాము లాంటిదే అయినా యువకులు ముందుకు వచ్చి జిల్లాస్థాయిలో పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, వార్డు సభ్యుడు దాడి పోలీసు, పార్టీ నేతలు సూరిశెట్టి దుర్గనాయుడు,పెంటకోట శ్రీనివాసరావు(నెట్),రవీంద్ర.జోగేశ్వరరావు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి కబడ్డీపోటీలు ప్రారంభిస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పలనాయుడు

అవగాహనతోనే వరి పైరులో తెగుళ్ల నివారణ

అనకాపల్లి టౌన్: రాగల ఐదు రోజుల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాలో వాతావరణం మేఘావృతమై తేలిక పాటి జల్లులు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 32.4 నుంచి 33.1 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 26.4 నుంచి 27.3 డిగ్రీల మధ్య ఉంటాయన్నారు. గాలిలో తేమ ఉదయం 73-81 శాతం, మధ్యాహ్నం 62-71 శాతం ఉండవచ్చన్నారు. గాలి గంటకు 9 కి.మీ. వేగంతో వీయవచ్చని తెలిపారు.

వరి పైరులో పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున లీటర్ నీటికి హెక్సాకొనజోల్ 2 మి.లీ. చొప్పున కలిపి దుబ్బు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. దుబ్బు చేసే దశలో ఎకరాకు 35 కిలోల యూరియాను వేసుకోవాలని, అంకురం దశలో 35 కిలోల యూరియాతో 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్‌ను వేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరి పైరులో ఆకు ముడత పురుగు ఆశించే అవకాశం ఉందని, జాగ్రత్తగా గమనించాలని రైతులను సూచించారు. నిర్దిత స్థాయి(దుబ్బుకి 1 లార్వా/2 పురుగులు సోకిన ఆకులు) దాటితే నివారణకు ట్రైకోగ్రామా పరాన్నజీవిని ఎకరాకు 2 కార్డుల చొప్పున విడుదల చేస్తే సరిపోతుందన్నారు. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే మొక్కలపై తాడులాగి, క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి 2.5 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. పంటలో జింక్ లోపం తలెత్తితే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్తలు సీహెచ్ ముకుందరావు, కేవీ రమణమూర్తి, ఎంబీజీఎస్ కుమారి, డి.ఆదిలక్ష్మి, ఎం.విశాలాక్షి, ఎ.శిరీష, వి.చంద్రశేఖర్, అలివేణి పాల్గొన్నారు.

పలు చోట్ల మోస్తరు వర్షం



వర్షంతో అడ్డురోడ్డులో రోడ్డుపై నిలిచిన నీరు

ఎస్.రాయవరం : మండలంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. అడ్డురోడ్డు జంక్షన్‌లో లోతట్టు ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలిచిపోయి వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ వర్షం నాట్లు వేసిన వరిపొలాలకు అనుకూలంగా ఉంటుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

అందరి సహకారంతో మెలిపాక అభివృద్ధి

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మెలిపాక సర్పంచ్ అయినంపూడి విజయభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం మెలిపాక సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. అందరి సహకారంతో గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సచివాలయ కన్వీనర్ గుంట్ల అప్పారావు, పంచాయతీ కార్యదర్శి దుర్గ,వార్డు సభ్యుడు గుల్ల అమర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడక ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు.ఈ మేరకు మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులు తెడ్డు లావణ్య,తెడ్డు రమ్యలను హెచ్ఎం శేషు, పీఈటీ మాలతీలు అభినందించారు. గత నెల 29న విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ ప్రియదర్శినీ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వారు అక్టోబర్ 15న కడపలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచితంగా ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులు కోలుకునేంత వరకు ఆస్పత్రిలో వసతితోపాటు, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, వైద్యసహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర పంటలు

మునగపాక : సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం రైతులకు లాభసాటిగా ఉంటుందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. రసాయనిక ఎరువులను వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. గణపర్తి హైస్కూల్లో ఐసీడీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన కూరగాయలను ఆయన పరిశీలించారు. మారుతున్న కాలంతో పాటు ప్రజలు కూడా ఆహారపు అలవాట్లను మార్చుకోవాలన్నారు. తాజా ఆహారంతో పాటు సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు.



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

పంచదార్లలో జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

రాంబిల్లి : పంచదార్ల సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు హాజరు కానున్నట్టు ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. గ్రామంలో టోకెన్లు అందుకున్న రోగులంతా శిబిరానికి హాజరై వైద్య సేవలు పొందాలని మన్మథరావు కోరారు.

యలమంచిలి : మండలంలో షేకిళాపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం జరుగుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం జరుగుతుందని తెలిపారు.

కోటవురట్ల: స్థానిక సచివాలయం -1 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీవిశ్వనాధరావు తెలిపారు. వైద్య శిబిరం జెడ్పీ గరల్స్ హైస్కూల్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. టోకెన్లు తీసుకున్నవారు మాత్రమే కాకుండా లేనివారు కూడా హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. నిపుణులైన వైద్యులు పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారని చెప్పారు.

పలువురికి సన్మానం

పాయకరావుపేట : హైమా నేత్రాలయా వైద్యుడు పసగడుగుల ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురిని సన్మానించారు. అన్నవరం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన దోమాడ సుందరావు, ఎంపీడీవోగా కాకినాడ జిల్లాకు పదోన్నతి పొందిన ఈవోఆర్డీ పి.వెంకటనారాయణ, పీఆర్‌టీయూ పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల ఉపాధ్యాయులు అడపా ప్రకాష్, రాపర్తి వీరభద్రరావు, పీఆర్‌టీయూ కార్యదర్శి హరికృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అరకు తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, సంఘ సేవకులు వంకా శ్రీను పాల్గొన్నారు.



హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో సన్మానాలు పొందిన అతిథులు

దేమునిగుమ్మం వేంకటేశుని హుండీ లెక్కింపు

అనకాపల్లిటౌన్: దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. 42 రోజులకు గాను రూ.2,56,842లు ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి ఆర్‌వీఎస్ఎస్ గౌరీ, ఈవో కె.ఆదినారాయణ వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజ్యలక్ష్మి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నల్లమారమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

అనకాపల్లిటౌన్: రామాపురం పంచాయతీలోని నల్లమారమ్మ ఆలయ అభివృద్ధికి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందించారు. నర్సింగరావుపేటలోని తన స్వగృహంలో దేవాలయ కమిటీ సభ్యులకు ఈ చెక్కును మంగళవారం అందించారు. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు.